# ఇంటిపుల్లకూర

బ్లాంకెట్ కొద్దిగా తొలగించి, ఒక కన్ను తెరిచి చూసింది సుమిత్ర. రావ్ లేచి, మంచం మీద దుప్పటి సరిగ్గా సర్దటం బెడ్ లైట్ కాంతిలో కనిపిస్తూంది.

అంటే నాలుగున్నరయిందన్న మాట.

డిసెంబర్ చలికి బ్లాంకెట్ లోంచి శరీరం వణుకుతూంది. డిసెంబరయినా ఏప్రిలయినా రావు నాలుగున్నరకే లేస్తాడు.

సుమిత్ర మళ్ళీ బ్లాంకెట్ కప్పుకుంది.

ఆమె లేచేసరికి ఆరున్నర అవుతుంది.

అప్పటికి అతడు మార్నింగ్ వాక్ కి వెళ్ళి రావటం, షేవ్ చేసుకోవటం, స్నానం చెయ్యటం కూడా అయిపో తుంది. ఆ తర్వాత అతడు టైప్ మిషన్ ముందు కూర్చుని ప్రైవేటుగా చేస్తున్న జాబ్ వర్క్ మొదలుపెడ్తాడు. లాయర్ల తాలూకు పేపర్లు టైప్ చేసినందుకు అతడికి నెల కో రెండొందల దాకా వస్తూంది.

తొమ్మిదింటికి అతడు సైకిల్ మీద పిల్లలిద్దర్నీ

ముందూ వెనకా ఎక్కించుకొని స్కూల్లో దింపి వస్తాడు.

ఎన్నో సంవత్సరాలనుంచీ జరుగుతున్న కార్యక్రమం యిది.

పెళ్ళయిన కొత్తలో భర్త మీద గౌరవంకొద్దీ తనూ లేవటానికి ప్రయత్నించింది. కుదర్లేదు. తరువాత ఆర్నెల్లకి భర్త మీద కమేండ్ వచ్చి తనతోపాటూ ఆరున్నరవరకూ 'ఉంచుకోవటానికి' ప్రయత్నించింది. అదీ కుదర్లేదు.

అలాగే ఎనిమిదేళ్ళు గడిచిపోయినయ్.

రావ్‌దంతా టైమ్ ప్రకారం నడవటం. జీవితం పట్ల సిన్సియారిటీ స్పష్టంగా కనిపిస్తూ వుంటుంది అతడి ప్రతి పనిలో.

అదే నచ్చదు సుమిత్రకి.

రావ్‌తో కాపురం ప్రారంభించి ఎనిమిదేళ్ళు కావొస్తున్నా పూర్తిగా ఎడ్జెస్ట్ కాలేకపోతోంది సుమిత్ర. అయితే దానిక్కారణం అవతలి వాళ్ళదే అని ఇద్దరి అభిప్రాయం.

మంచి రొమాంటిక్ మూడ్‌లో లేచి మంచం దిగుతాడు.

"ఏమైంది" అడుగుతుంది.

"ఆ మూల చూడు, గోడకి బూజు" అంటాడు. లాగి తందామన్నంత కోపం వస్తుంది. దాన్ని అణిచి పెట్టుకుని "రేప్పొద్దున్న తీయొచ్చుగా" అంటుంది.

"అసలివ్వాళ మధ్యాహ్నమే దాన్ని గమనించి నువ్వు తీయాల్సింది. అవును సుమిత్రా— నువ్వు పగలంతా, నేను

ఆఫీసు కెళ్ళిపోయిన తర్వాత ఏం చేస్తావు?" స్టూలు మూలకి లాగుతూ, పాతచీపురు బూజు దులపటానికి పట్టుకొని అతడు అడిగేడు.

"పక్కింటి రుక్మిణి దగ్గిర కూర్చుంటాను" అంది పళ్ళు మండి.

• • •

అదే టైమ్‌కి పక్కింట్లో "ఏమండీ— లేవండీ" అంది రుక్మిణి మొగుణ్ని కుదుపుతూ. నారాయణ్ 'ఊ' అంటూ మూలిగి ఇటునుంచి అటు తిరిగి పడుకున్నాడు.

"హిందీలో వార్తలు కూడా అయిపోవస్తున్నాయి లేవండీ" దుప్పటి లాగుతూ అంది. అతడు చప్పున ఆమెని లోపలికి లాక్కొన్నాడు. రెండు నిముషాల తరువాత ఆమె అతి కష్టం మీద బైటపడి "స్నానం చేసి ఏం లాభం— తలంతా మళ్ళీ దువ్వుకోవాలి, ఖర్మ" అంటూ వంటింట్లోకి వెళ్ళింది.

తరువాత అరగంటకి నారాయణ్ లేచాడు. "ఒరేయ్ లేవరా" అంటూ బాబిగాణ్ని లేపేడు.

తండ్రీకొడుకులిద్దరూ బ్రెష్‌లు నోట్లో పెట్టుకొని పెరట్లోకి వచ్చేరు.

రుక్మిణి "వేన్నీళ్ళు పెట్టనా" అంది.

నారాయణ్ భారంగా మూలిగి, "ఊ" అన్నాడు. ఆమె లోపలికి వెళ్ళింది. అరగంటసేపు తోమీ తోమీ— కొడుకుతో తోమించి, లోపలికి వచ్చేడు. ఈలోగా రుక్మిణి

వేన్నీళ్ళు పెట్టింది.

"ఈ రోజేం కూర డియర్" అంటూ వంటింట్లోకి ప్రవేశించి మూకుడులో వున్న దొండకాయ వేపుడు ముక్కలు ఒక్కొక్కటే తీసి నోట్లో వేసుకోసాగేడు. రుక్మిణి తల కొట్టుకుని "అబ్బా... మళ్ళీ యిక్కడ చేరేరూ. నీళ్ళు చల్లారిపోతున్నాయి అక్కడ, వెళ్ళండీ" అని బలవంతంగా బైటికి తోసింది.

బాబిగాణ్ని స్కూలుకి తీసుకెళ్ళటం నారాయణ్‌కి ప్రతిరోజూ ప్రాబ్లమే. వాణ్ని దించి వచ్చేక వంటింట్లో చేరేడు మళ్ళీ "చార్లో తాలింపు పెట్టడం నీకు రాదోయ్" అంటూ.

"నా కొచ్చుగానీ, మీరు బైటకి వెళ్ళండి" అంది.

దాన్ని వినిపించుకోకుండా పోపుల డబ్బా తీసుకొని ఎండు మిరపకాయలు గిల్లి ప్లేట్లో వేయసాగేడు. రుక్మిణి పొయ్యి మీద మూకుడు పెట్టి నూనె కాగిందా లేదా అని చూస్తూంది.

పెరట్లో కొచ్చిన సుమిత్ర కిటికీలోంచి వీళ్ళిద్దర్నీ చూస్తూంది.

*　　*　　*

"సుమీ" అంటూ లోపలికి వచ్చేడు రావు. "చూడు నీకు ఏం ప్రజంటేషన్ తెచ్చానో."

"ఏమిటి" బైటకొచ్చి చూసింది. ఆమె కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. రావు నవ్వుతూ చూస్తున్నాడు.

"స్కూటర్ ?" అంది.

నవ్వుతూ తలూపేడు. ఆమె, తన కళ్ళని నమ్మలేక "కొన్నారా ?" అంది.

"మరి ?"

"ఓ డియర్" అంటూ గాలిలా దగ్గరికి వెళ్ళి అతడి మెడ చుట్టూ చేతులు వేసి ముద్దు పెట్టుకొంది. అతడు కదల కుండా అలానే నిలబడి, "సుమిత్రా— ఒక్క మాటకి జవాబు చెప్పు. ఇదంతా నా మీద ప్రేమా, స్కూటర్ మీదా ?" అని అడిగేడు.

ఆమె చప్పున చేతులు తీసేసి కొరకొరా చూస్తూ "యూ ఆరేన్ ఇడియట్" అంది కోపంగా.

అయితే ఆ కోపం రాత్రి తొమ్మిదయ్యేసరికి తగ్గి పోయింది. నెమ్మదిగా అతడి దగ్గర జేరి, "సెకండ్ షోకి వెళ్దామా" అంది లాలనగా.

ఆరోజే కొత్తగా కొన్న స్కూటర్ మీద ఎక్కాలని —భర్తతో కల్సి సినిమా చూడాలనీ ఆమె మనసునిండా కోర్కె నిండుకుంది. అయితే దాన్ని అతడు గుర్తించలేదు. టైప్ మిషన్ ముందు కూర్చున్నవాడల్లా తలెత్తి నిదానంగా ఆమెవైపు చూసేడు.

"ఈ పేపర్లు టైప్ చెయ్యటం రాత్రికి పూర్తవ్వాలి. లేకపోతే లాయరుగారు జాబ్ వర్క్ తాలూకు డబ్బు ఇవ్వరు" అన్నాడు.

"డబ్బు— డబ్బు— డబ్బు" అంది విసుగ్గా. "ఎప్పుడూ

డబ్బేనా—"

"మరి ఆ డబ్బే లేకపోతే ఈ రోజు స్కూటర్ ఎలా వచ్చేది?" అని లేచి, ఆమె దగ్గిరకి వచ్చి అన్నాడు, "చూడు సుమిా— కలల్లో బ్రతకటం వేరు, కలల్ని నిజం చేసుకోవటానికి ప్రయత్నించటం వేరు. మనం రెండో వర్గానికి చెందాలని నేను కోరుకుంటున్నాను."

"భార్యతో సినిమాకి వెళ్ళటంలో తప్పేం వుంది ?"

"ఈ అర్ధరాత్రి పూట నిద్ర మానుకుని సెకండ్ షోకి వెళ్ళకపోతేనేం ? దీనివల్ల ఈ రోజు పని నష్టం, రేపు ఆఫీసులో పని కష్టం."

ఆమె అతనివైపు ఉక్రోషంగా చూసి అన్నది, "నీ అంత క్యాలిక్యులేటెడ్‌గా బ్రతికేవాడితో ఏ ఆడదీ కాపురం చెయ్యలేదు రావ్ ! నిజం" అంతలో ఆమెకి రోడ్డు మిాద నారాయణ్ దంపతులు కనపడ్డారు. "అదిగో, ఆ రుక్మిణిని చూడు ఎంత అదృష్టవంతురాలో. మొగుడూ పెళ్ళాం అంటే అలా వుండాలి. ఆ నారాయణ్ వంటింట్లో భార్యకి సాయం చేస్తాడు. పిల్లలకి దగ్గిరుండి స్నానం చేయిస్తాడు. అతణ్ణి చూసి బుద్ధి తెచ్చుకో. దేనికైనా పెట్టిపుట్టాలి. హూ—" అని విసవిసా లోపలికి వెళ్ళిపోయింది, "ఆ రుక్మిణి అదృష్టం ఎవరికీ రాదు" అనుకుంటూ.

* * *

ఆ మరునటిరోజు రుక్మిణి సుమిత్ర దగ్గరికి వచ్చింది ఓ గ్లాసుడు పంచదారుంటే ఇమ్మని.

"ఎవరో వచ్చినట్టున్నారు" అడిగింది సుమిత్ర.

"అవును వదినగారూ! మా క్లాస్‌మేట్స్. ఇక్కడో స్నేహితురాలి పెళ్ళంటే వచ్చారు" అని తమింటివైపు చూసింది.

ఆమె మొహం వాడిపోయింది కొద్దిగా. వాళ్ళమధ్య ఒక కుర్చీలో నారాయణ్ కూర్చుని కబుర్లు చెబుతున్నాడు. వళ్ళో కొడుకు కూర్చొని వున్నాడు. నారాయణ్ వంటి మీద చొక్కా, బనీనూ లేవు.

"ఈయనకి బుద్ధిరాదు వదినగారూ! అన్నీ ఆడంగి చేష్టలే—" అని గ్లాసు తీసుకొంటూ అంది- "మీ ఆయన్ని చూస్తే ముచ్చటేస్తుంది. అన్నీ టైమ్ ప్రకారం చేస్తారు. స్కూటర్ కూడా కొన్నారు కదా. మొగాడంటే అలా వుండాలి వదినగారూ. మా ఆయనా వున్నాడెందుకు-వంటింట్లో చేరి కబుర్లు చెప్పమంటే మాత్రం తయారు. మహాబద్ధకస్తుడు. అర్ధరాత్రివూట హఠాత్తుగా మూడ్ వస్తే సినిమా అంటారు. ప్రొద్దున్న తొమ్మిదింటి వరకూ లేవరు. ఈయన్తో వేగలేక ఛస్తున్నాను వదినగారూ! మీ అదృష్టం ఎవరికీ రాదనుకోండి" ఆమె చెప్పుకుపోతూంది.

సుమిత్ర తెల్లబోయి చూస్తూనే వుంది.